

కథా కౌముది

# అవయవాలు మొలిచిన మనిషి

ఎమ్వీ రామిరెడ్డి

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

1

సాయంత్రం అయిదున్నర... కంప్యూటర్లతో కుస్తీపట్టి అలసిపోయిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సుమారు రెండొందల మంది ఆ హాల్లో సమావేశమయ్యారు.

శాలిని ఆహ్వానించగానే, శేఖర్ కుడిచేత్తో మైక్ అందుకుని, తన గతంలోకి ప్రయాణం ప్రారంభించాడు.

2

పక్కటెముకల దగ్గరెక్కడో కార్చిచ్చు మొదలై, అది మెల్లగా తొడ గుండా ప్రయాణించి, కుడి మోకాలి వద్ద కేంద్రీకృతమైంది. మెడనరాల దగ్గర రగిలిన మరో జ్వాల జరజరా పాకి ఎడమ భుజంలో పాగా వేసింది.

నిర్జీవ దేహానిక్కూడా నొప్పి తెలిసొచ్చే మంట. శవానికి సైతం స్పృహ తెప్పించే సెగ.

అగ్నిశిఖలు అటూ ఇటూ తచ్చాడి, ఆఖరికి, కోమాలోకి వెళ్లిన మెదడు కణాలను సైతం నిద్ర లేపాయి.

శేఖర్‌కు మెలకువ వచ్చింది.

ఎవరో గొడ్డలితో నరికినట్లు... కుడికాలు మండుతోంది. కత్తితో ఖండించినట్లు... ఎడమచేయి పోటెత్తుతోంది.

అతికష్టం మీద కళ్లు తెరిచాడు. తానెక్కడున్నాడో అర్థం కాలేదు. కళ్లు మూసుకుని, ఆలోచనా శక్తిని కూడదీసుకున్నాడు. మెదడు మెల్లగా పని చేయడం మొదలుపెట్టింది.

తననెవరో తోస్తున్నారు. నిప్పుల్లోకి. సుడిగుండంలోకి. పాతాళంలోకి. దబ్బున పడిన శబ్దం.

తోసినవాడి మొహం అస్పష్టంగా మస్తిష్కపు తెరపై కదలాడుతోంది.

కళ్లు విప్పి, చుట్టూ చూశాడు. తెల్లటిగూళ్లు. నిండా ముసుగులు కప్పుకొని పడుకున్న మనుషుల్లా.

నాసికా గ్రంథులకూ జీవం వచ్చింది. ఏదో దుర్గంధం. భరించలేని దుర్వాసన.

శక్తిని కూడదీసుకునేందుకు ప్రయత్నించాడు. సాధ్యం కాలేదు. మళ్లీ ప్రయత్నించాడు. ఈసారి గురుత్వాకర్షణను నడుం వద్ద కేంద్రీకరించి, అతికష్టం మీద కూర్చోగలిగాడు. ఎడమచేయి వేలాడుతోంది.

ఎడమకాలిని మంచం మీంచి కిందికి వేలాడేశాడు. కుడికాలు మొండికేసింది. కుడిచేతిని మోకాలి కింద దూర్చి, కట్టెపుల్లను జరిపినట్లుగా కుడికాలిని కూడా కిందికి వేలాడేశాడు.

లేచి నిలబడబోయి, కుప్పకూలాడు. విశ్వప్రయత్నంతో మళ్లీ నిలబడ్డాడు. ఒక కాలిని ఈడ్చుకుంటూ ఒక్కో అడుగూ ముందుకేశాడు. అటూ ఇటూ మంచాలు. వాటిమీద తెల్లటి మూటలు. వాటి మధ్య నుంచి కుంటుతూ కూలుతూ ఆ హాలు నుంచి బయటకు నడిచాడు.

మరో హాలు వెలిసింది. రెండువైపులా మంచాలు. వాటిమీద అక్కడక్కడా మనుషులు. వాడిపోయిన కాడల్లా, వడలిపోయిన కాయల్లా. అదో ఆసుపత్రి అని అర్థమైంది.

గోడ గడియారం వైపు చూశాడు. ఉదయం ఏడు దాటుతోంది. నడిచొచ్చిన దారివంక చూశాడు. నెత్తురోడిన అడుగుజాడలు భయం గొల్పుతున్నాయి.

ఖాళీగా ఉన్న మంచం మీద కూలబడ్డాడు. కడుపులో అలజడి. నొప్పిని మించిన శోష. కళ్లు తిరుగుతున్నాయి.

ఆకలి దహించివేస్తోంది. కడుపులో ఏదో ఒకటి పడితే తప్ప ప్రాణం నిలిచేలా లేదు.

కీచుమంటూ శబ్దం. ఆ వెనకే అవతలి ద్వారం నుంచి ఓ బండిని తోసుకుంటూ వార్డుబాయ్ హాల్లోకి వచ్చాడు. ఉపాహారంతో కూడిన పళ్లేలు ఒక్కొక్కరికీ అందిస్తూ ముందుకు నడుస్తున్నాడు. చివరి మంచం మీదున్న శేఖర్ తక్కున లేచి కూచున్నాడు. బాయ్ దగ్గరకు రాగానే ఏదో అడగబోయాడు. మాట పెగల్లేదు. గొంతు సవరించుకుని ఒక్కో మాటా కూడగట్టుకుంటూ "అన్నా, నాకూ ఇవ్వవా" అన్నాడు.

బాయ్ ప్రశ్నార్థకంగా చూశాడు. "ఎవర్నువ్వు? ఎప్పుడు జాయినింగు? కేస్ షీటేదీ? రాత్రి కూడా లేవుగదా?"

శేఖర్‌కు వివరణ ఇచ్చే ఓపిక లేదు. జేబులో చెయ్యి పెట్టబోయి, విఫలమయ్యాడు.

"అన్నా, నా ప్యాంటుజేబులో పర్సుంది. కాస్త తీసిపెట్టవూ" అభ్యర్థించాడు.

బాయ్ ఓ క్షణం అనుమానంగా చూసి, శేఖర్ జేబులో చెయ్యి పెట్టి, పర్సు బయటికి తీశాడు.

"అందులో యాభై నోటుంది, తీసుకో. నాకు రెండు ఇడ్లీ ఇచ్చి పుణ్యం కట్టుకో".

బాయ్ నోటును తన జేబులోనూ, పర్సును శేఖర్ జేబులోనూ పెట్టాడు. ఇడ్లీ పళ్లేన్ని మంచంమీద ఉంచి, బండిని తోసుకుంటూ నిష్క్రమించాడు. బ్రష్ చేసుకోవాలన్న స్పృహ లీలగానైనా అతన్ని తాకలేని స్థితిలో, కుడిచేత్తో ఇడ్లీలు ఆవురావురుమంటూ తిన్నాడు. ప్రాణం తిరిగొచ్చినట్లయింది.

చేతినెలా కడుక్కోవాలా అని ఆలోచిస్తుండగా, ఇద్దరు నర్సులు హడావుడిగా వచ్చారు.

"ఏయ్, ఎవర్నువ్వు?" చిరాగ్గా చూస్తూ అడిగిందొక నర్సు. పిచ్చిచూపులు చూశాడు శేఖర్.

"ఇతను... ఇతన్ని మొన్న మార్..." మాట పూర్తి కాకముందే కెవ్వుమని అరిచింది మరో నర్సు.

మళ్లీ స్పృహ కోల్పోతున్న శేఖర్‌కు వాళ్ల మాటలు లీలగా వినిపిస్తున్నాయి.

"మేరీ... ఏమైంది... ఎందుకలా వణికిపోతున్నావ్?"

"యాక్సిడెంట్ కేస్... డెత్ కన్ఫర్మ్... ఇతన్ని నిన్న రాత్రి... రాత్రి... మార్చురీలో పెట్టాం..."

+++++++++++

శేఖర్‌కు స్పృహ వచ్చేసరికి బెడ్‌మీద ఉన్నాడు. శరీరంలోకి సెలైన్ ఎక్కుతోంది.

కుడికాలికీ, ఎడమచేతికీ సిమెంటు కట్లు ఉన్నాయి. ఆ రెండు అవయవాలూ కొలిమిలో కాలిపోతున్నట్లు... భరించలేని బాధ. 'సందేహం లేదు, నరకమంటే ఇదే!' అనుకున్నాడు.

బండిని తోసుకుంటూ వచ్చిన బాయ్ అన్నం పళ్లేన్ని మంచం పక్కన పెట్టి, శేఖర్‌కు దగ్గరగా వచ్చి, "అన్నా, ఈడ నీకు సక్కంగ వైజ్జెం జెయ్యరు. నా మాటిని ప్రైవేటు దవాఖానకు బొయ్యి సూపిచ్చుకో" అన్నాడు.

తండ్రి ఫోన్ నంబరు ఇచ్చి, సమాచారం అందించమని అభ్యర్థించాడు శేఖర్.

''బైటికెల్లి జేస్తాలే'' అంటూ వెళ్లిపోయాడు బాయ్.

శేఖర్ భారంగా కళ్లు మూసుకున్నాడు.

తననెవరో తోస్తున్నారు. నిప్పుల్లోకి. ఎవరో కాదు. ఆప్తుడే. ఒకే గదిలో నివశించే స్నేహితుడే. రాజేంద్ర!

ఆరోజు జరిగిన సంఘటన మనసుతెర మీద ప్రత్యక్షమవుతోంది...

శాలిని వచ్చేసరికి రాజేంద్ర రైసుమిల్లులో పనికెళ్లిపోయాడు. తను వంట చేస్తున్నాడు.

''అర్జెంటుగా రాజేంద్రను కలవాలి. ఈరోజు అటో ఇటో తేల్చుకుంటాను'' శాలిని.

''నా మాట వినండి మేడమ్. మీరు చదువుకున్నారు. వాడు రైసుమిల్లులో డ్రైవర్. బాధ్యత గుర్తెరగని మనిషి'' నచ్చజెప్పడానికి ప్రయత్నించాడు తను.

''అతన్ని మర్చిపోలేకపోతున్నాను. నాకతను కావాలి'' ఏడుస్తోంది.

''పదండి వెళ్దాం'' తలుపులు మూసి, శాలినిని వెంటబెట్టుకుని బయల్దేరాడు.

గొర్రెలకాపరి అయిన తండ్రి తాహతును దృష్టిలో ఉంచుకుని, పదో తరగతి తర్వాత ఐటీఐలో చేరాడు తను. జిల్లా కేంద్రంలో మారుమూలన ఓ గది తీసుకుని, చదువు మీద దృష్టి సారించాడు.

టీకొట్టు దగ్గర పరిచయమైన రాజేంద్ర మెల్లగా తన గదిలో మకాం వేశాడు. వయసులో పెద్దవాడైనప్పటికీ, అల్లరిచిల్లరగా తిరుగుతున్న రాజేంద్రను ఒప్పించి, ఓ రైసుమిల్లులో డ్రైవరుగా పనికి కుదిర్చాడు తను.

నెలనెలా జీతం వస్తుండటంతో రాజేంద్ర నిలదొక్కుకున్నాడు. అందంపై శ్రద్ధ పెరిగింది. అమ్మాయిలపై మోజు పెరిగింది. ఆ దిశగా చేసిన ప్రయత్నాల్లో భాగంగా శాలిని స్నేహం దొరికింది.

'సరదాగా వల వేస్తే, సీరియస్‌గా వెంటపడుతోందిరా. వదిలించుకోవాలి' అనేవాడు రాజేంద్ర.

'తప్పన్నా. ఆమె చాలా మంచిది. బాగా చదువుకుంది. ఉద్యోగం సంపాదించుకోగలదు. ఇద్దరూ హాయిగా బతకొచ్చు' హితబోధ చేసేవాడు తను.

'నీ మొహం. నీకు తెలియదులే' కొట్టిపారేసేవాడు రాజేంద్ర.

నాలుగేళ్లు పెద్దదైన శాలిని అంటే తనకు అభిమానం. స్నేహితుడి గురించి చెడుగా చెప్పడానికి మొహమాటం. కానీ, ఆమె తేల్చుకోవడానికి సిద్ధమైందని తెలిసి, నిజం చెప్పాలని ప్రయత్నించాడు. ఆమె వినలేదు.

రైసుమిల్లు దగ్గరైంది. పక్కనే ఉన్న బిల్డింగులోని మొదటి అంతస్తులో ఆఫీసు. డ్యూటీ మీద బయటికి వెళ్లకపోతే, ఆఫీసు పక్కనున్న రూములో దొరుకుతాడు రాజేంద్ర. మొదటి అంతస్తుకు చేరుకుని, దగ్గరగా మూసి ఉన్న ఆ రూము తలుపుల్ని తాకబోతుండగా ''శేఖర్. నువ్వు బయటే ఉండు'' అందామె.

శేఖర్ వెనక్కి నడిచి, పిట్టగోడ మీద కూచున్నాడు. తలుపులు తోసుకుని, ఆమె లోపలికి వెళ్లడం కనిపిస్తూనే ఉంది. గోడ మీంచి వెనక్కి చూశాడు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే రెండు కుక్కలు పోట్లాడుకుంటున్నాయి. పైకి చూశాడు. చేతికందేంత ఎత్తులో కరెంటు స్తంభాల వైర్లు.

రెండు నిమిషాలు గడిచాయో లేదో, శాలిని ఏడుస్తూ బయటికొచ్చింది. ''వాడు... వాడు... రోగ్... బాస్టర్డ్... నాకొద్దు...'' కళ్లు తుడుచుకుంటూ మెట్లమీంచి కిందికెళ్లిపోయింది.

ఏం జరిగిందో తనకు అర్థం కాకముందే, రాజేంద్ర చొక్కా తొడుక్కుంటూ బయటికొచ్చాడు. ఎద్దులా బుస కొడుతూ... వస్తూనే శేఖర్‌పై దాడి చేశాడు.

''ఏం బే, ఈడ నా ఇష్టమొచ్చినట్లుంట. నాకు నచ్చిన దాంతో కులుకుతుంట. వచ్చేస్తావా... ఏడకి బడితే ఆడికి దాన్ని తీసుకుని వచ్చేస్తావా...'' అదుపు తప్పిన ఆవేశంతో శేఖర్‌ను గట్టిగా తోశాడు.

క్షణంలో వందో వంతు... మెదడులో ట్రాన్స్‌ఫార్మర్ కదిలింది. పిట్టగోడ మీంచి వెనక్కి పడకుండా నిభాయించుకోవడానికి ఎడమచేతిని పైకెత్తి, అందిన ఆధారాన్ని దొరకబుచ్చుకున్నాడు. ఆ ఆధారం విద్యుత్తీగ.

ఆ షాక్‌కు ఎగిరి కింద పడ్డాడు. అంతే, ఆ తర్వాత తనకు తెలివొచ్చేసరికి 'తెల్లమూటల' మధ్య పడి ఉన్నాడు.

+++++++++++

రెండు గంటల్లోపే శేఖర్ తల్లిదండ్రులు ఆస్పత్రికి చేరుకున్నారు. కొడుకుని చూసి కుమిలి కుమిలి ఏడ్చారు. ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ అత్యవసర వైద్యం అందించారు.

శేఖర్ తండ్రిని పిలిచి "అక్కడ అడ్డదిడ్డంగా కట్లు వేశారు. అసలది వైద్యమే కాదు. అంతకన్నా మేం వాళ్లను నిందించలేం. ఇప్పటికైనా వాస్తవ పరిస్థితి మీకు తెలియాలి..." అన్నారు డాక్టర్లు.

"సెప్పండయ్యా" అడిగాడు తండ్రి, కన్నీటిని పంటిబిగువున అదిమిపెడుతూ.

"మీ అబ్బాయికి ఎడమచేతిని చంకల్లో దాకా... కుడికాలిని మోకాలి దాకా తీసెయ్యాలి. పెద్దపెద్ద ఆపరేషన్లు అవసరం. డబ్బు చాలా ఖర్చవుతుంది..."

"అయ్యా, పానం సంగతి సెప్పండి. ఆడు మా కళ్లముందు ఊపిరి పీలుస్తా ఉంటే అదే సాలు..."

"ప్రాణాలకేం ప్రమాదం లేదు పెద్దాయనా" భరోసా ఇచ్చారు.

"ఎంత కర్సయినా పర్లేదు సామీ. ఆపరేసన్లు మొదులుబెట్టండి" రెండు చేతులూ జోడించి చెప్పాడు.

సొంతిల్లు అమ్మేశాడు. గొర్రెల్ని సంతలో తెగనమ్మాడు.

వైద్యులు సవాలుగా తీసుకుని రెండు రోజులపాటు ఆపరేషన్లలో తలమునకలయ్యారు.

ఒంటినిండా తెల్లటి కట్లుతో వారం రోజులపాటు ఐసీయూలో ఉండి, ప్రత్యేక గదికి చేరుకున్నాడు శేఖర్.

మూడు నెలలు ఆస్పత్రిలో ఉండాలన్నారు. మరో మూడు నెలలు ఇంట్లోనే విశ్రాంతి తీసుకోవాలని చెప్పారు.

రెండు నెలలు గడిచేసరికే ఒళ్లంతా పుళ్లు పడ్డాయి.

పొలం పనులు తప్ప, పడకేసిన వారికి సేవలెలా చెయ్యాలో తెలియని శేఖర్ తల్లికి అదో శిక్షగా మారింది.

కదలని క్షణాలు, శరీరం నిండా పరుచుకున్న గాయాలతో అతనికి జీవితం మీద విరక్తి మొదలైంది.

ఆ సమయంలో ఓరోజు ఆకాశం నుంచి జారిపడిన పూలమొక్కలా ఆస్పత్రికి వచ్చింది శాలిని.

"సారీ శేఖర్. అంతా నా వల్లనే. నువ్వు చనిపోయావని చెప్పారు. థాంక్ గాడ్. బతికున్నావు" కన్నీటి పర్యంతమైంది. శేఖర్‌లో సరికొత్త ఉత్సాహం.

"అసలు... ఆరోజు... నేను పడిపోయాక ఏం జరిగింది?" ప్రపంచంతో మాట్లాడి చాలా కాలమైనట్లు తన గొంతు తనకే కొత్తగా అనిపించింది.

"నీ కేక వినిపించి నేను పైకి పరుగెత్తుకొచ్చాను. రాజేంద్ర క్షణాల్లో మాయమయ్యాడు. నువ్వసలు ప్రాణంతో ఉన్నావో లేదో తెలియదు. మిల్లు కార్మికుల సాయంతో ప్రభుత్వాసుపత్రికి చేర్చాను. నాలుగైదు గంటల తర్వాత నువ్వు చనిపోయావని చెప్పారు. పోలీసులొచ్చారు. ఒక్కసారి చూస్తానని బతిమాలినా ఒప్పుకోలేదు. మీ అమ్మానాన్నలకు కబురు చేస్తామన్నారు. అప్పటికే మా అమ్మ చాలాసార్లు ఫోన్జేసింది, మందులు కావాలని. నేను ఇంటికెళ్లిపోయాను..."

"పర్లేదు. ఇప్పుడు నాక్కాస్త ధైర్యం కావాలి. మీరిస్తారా..."

"తప్పకుండా. నువ్వు మామూలు మనిషివయ్యేదాకా నేనుంటా..." భరోసా ఇచ్చిందామె.

ఆ గది కిటికీలోంచి చొచ్చుకువచ్చిన గాలి రోగనిరోధకశక్తిని వీచింది. సూర్యకిరణాలు నులివెచ్చగా తాకాయి. పూలతోటలోంచి వచ్చే పరిమళాలు కొత్త సువాసనలు వెదజల్లాయి.

కర్ర సాయంతో నడవడం సాధన చేశాడు.

ఇంటికి చేరుకున్నా, అప్పుడప్పుడూ శాలిని వచ్చి వెళుతోంది. ధైర్యం చెబుతోంది. ఉత్సాహపరుస్తోంది.

ఓరోజు మరింత ఆనందంగా వచ్చింది. తనవెంట వచ్చిన ఓ స్వచ్ఛందసంస్థ నిర్వాహకుడు శేఖర్‌కు జైపూర్ కొయ్యకాలిని అమర్చాడు. మొదట్లో నడుస్తుంటే మోకాళ్ల దగ్గర మంటలు రాజుకునేవి. పంటిబిగువున ఆ బాధ భరిస్తూ నడవడం మొదలు పెట్టాడు.

మరో మూడు నెలలు గడిచాయి.

శేఖర్ నడవగలుగుతున్నాడు. కాలకృత్యాలు తీర్చుకోవడం, స్నానం చేయడం, బట్టలు తొడుక్కోవడం, అన్నం తినడం... అన్నీ సొంతంగా చేసుకోగలుగుతున్నాడు.

"నాకు హైదరాబాదులో ఉద్యోగం వచ్చింది. రేపే వెళ్తున్నా" స్వీట్‌బాక్సుతో వచ్చి మరీ చెప్పింది శాలిని.

"కంగ్రాట్స్" నవ్వుతూ స్వీటు అందుకున్న అతని మొహంలో దిగులు పరుచుకుంది.

"ఎందుకలా ఢీలా పడ్డావ్? నీతోనే ఉండిపోనా?" నవ్వుతూ అడిగిందామె.

"ఛఛ, అపార్థం చేసుకోకండి. నా దిగులంతా నాన్న గురించే".

"ఏమైంది ఆయనకు?"

"భారమైంది. నేనూ పదో పరకో సంపాదించగలిగితే..."

"అర్థమైంది. నీకు హార్డ్‌వేర్ అంటే చాలా ఇష్టం కదా?"

"అవును" అతని మొహం విప్పారింది.

"అయితే పద" అప్పటికప్పుడు శేఖర్ని తీసుకుని జిల్లాకేంద్రానికి వెళ్లింది. తన పెదనాన్న కొడుకు నడుపుతున్న సెల్‌ఫోన్ షాపులో అతన్ని ఉద్యోగానికి కుదిర్చింది.

ఆమెకు సెల్యూట్ చేశాడు. శాలిని అతనికి దగ్గరగా వచ్చి, నుదుటిపై ముద్దుపెట్టి, చకచకా వెళ్లిపోయింది.

ఎనిమిది నెలలు గడిచాక లోన్ తీసుకుని, తనే సొంతంగా షాపు తెరిచాడు. ఆత్మవిశ్వాసం కుదురుకుంది. ఒంటిచేత్తో సైకిలు తొక్కడం బాగా అలవాటైంది. సాయంత్రం వేళల్లో పరిగెత్తడం మొదలు పెట్టాడు. క్రమంగా అదో వ్యసనంలా మారింది. తను సైకిలు తొక్కుతున్న ఫొటోలు, పరిగెత్తుతున్న దృశ్యాలు ఫేస్‌బుక్‌లో పెట్టేవాడు. ఎన్నో లైక్‌లు వచ్చేవి. అలా పరిచయమైన ఓ మలయాళీ ఓరోజు ఫోన్ చేశాడు.

"వచ్చే ఆదివారం హైదరాబాదులో 10కె రన్ ఉంది. పార్టిసిపేట్ చేస్తావా?"

అతను కూడా తనలాంటి బాధితుడే. ఇప్పుడు రన్నర్‌గా గుర్తింపు తెచ్చుకుంటున్నాడు.

"ష్యూర్".

ఆరోజు ప్రముఖుల సమక్షంలో 10కె రన్ జరిగింది. అందరి కన్నా చివరగా లక్ష్యం చేరిన శేఖర్ ఆనందంతో గంతులు వేస్తున్నాడు. రెండు కాళ్లకూ షూలూ, జీన్స్‌ప్యాంటు వేసుకుని దుక్కలా ఉన్న శేఖర్ అలా ఎందుకు ఎగురుతున్నాడో అర్థం కాక అక్కడ చేరిన కొందరు తల గోక్కున్నారు.

ఎగిరీ ఎగిరీ, కింద చతికిలబడిన అతన్ని ఓ పెద్దాయన సమీపించి "అందరికన్నా వెనకొచ్చి, ఎందుకలా ఎగిరిపడుతున్నావ్?" అన్నాడు.

శేఖర్ ఆయన వంక అదోలా చూసి, కుడికాలివైపు ప్యాంటును మోకాళ్ల దాకా పైకి లాగాడు.

ప్రోస్థటిక్ లెగ్స్ అమ్మే షాపు ఓనర్ అయిన ఆ పెద్దాయన శేఖర్ తొడుక్కున్న చెక్కకాలిని చూసి ఆశ్చర్యపడలేదు. పరిగెత్తడం వల్ల అది ఒరుసుకుని, విపరీతంగా కారిన రక్తం చూసి, షాకయ్యాడు.

"మొదటి సారా?" అడిగాడాయన.

"అవును. అందుకే ఇంత ఆనందం" బాధను కప్పెట్టిన నవ్వు మొహంతో బదులిచ్చాడు శేఖర్.

ప్రాథమిక వైద్యం అందించాక, ఆయన శేఖర్‌ని వెంట తీసుకెళ్లాడు.

షాపులో కూర్చోబెట్టి, ఎన్నో ప్రశ్నలు వేశాడు. శేఖర్ ఆత్మవిశ్వాసంతో జవాబిచ్చాడు.

"జైపూర్ లెగ్ బరువెక్కువ. మన్నిక తక్కువ. సెప్టిక్ అయ్యే ప్రమాదముంది. ఇప్పుడందరూ ప్రోస్థటిక్ లెగ్స్ వాడుతున్నారు. నీకది ఫ్రీగా ఇస్తా. మా షాపు తరఫున మార్కెటింగ్‌లో ఉద్యోగమిస్తా. ఇష్టమేనా?"

అప్పటికే షాపు నష్టాల్లో నడుస్తుండటంతో ఆయనిచ్చిన అవకాశం బంగారు బాతుగుడ్డులా కనిపించింది.

షాపును అమ్మేసి, లోన్ చాలావరకు తీర్చేసి, హైదరాబాదు చేరుకున్నాడు. అమీర్‌పేటలో రూము తీసుకున్నాడు. ప్రోస్థటిక్ లెగ్ చాలా తేలిగ్గా, సొంత కాలున్నంత సౌకర్యంగా ఉండటంతో సైక్లింగ్‌ను సీరియస్‌గా తీసుకున్నాడు. డబ్బు కూడబెట్టుకుని, 'రన్నింగ్ బ్లేడ్' కొనుక్కుని పరుగు సాధనను ముమ్మరం చేశాడు.

చాలా కాలం తర్వాత ఆరోజు రాత్రి శాలినికి ఫోన్ చేశాడు.

+++++++++++

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలు మొదలయ్యాయి.

అన్ని అవయవాలూ సరిగా ఉన్నవారితో పోటీ పడుతున్నాడు శేఖర్.

కాళ్ల దగ్గర బ్రేక్ ఉండేలా ప్రత్యేకంగా తయారు చేయించుకున్న సైకిల్‌ను... ఒంటిచేత్తో కంట్రోల్ చేసుకుంటూ... శక్తినంతా కూడదీసుకుని తొక్కుతున్నాడు.

స్టేడియంలో కూర్చున్న శాలిని ఉత్కంఠగా చూస్తోంది.

ఒక్కో రౌండు పూర్తవుతోంది. మొదట్లో ముందంజలో ఉన్న శేఖర్ క్రమంగా వెనకబడిపోతున్నాడు.

శాలినికి ఏడుపు తన్నుకొస్తోంది.

చివరి రౌండు. ఒక్కసారిగా పుంజుకున్నాడు శేఖర్. చూస్తుండగానే రివ్వున దూసుకొచ్చి, రెండో స్థానంలో నిలిచాడు. శాలిని కేరింతలు కొట్టింది. పరుగు పరుగున స్టేడియంలోకి వచ్చి, కౌగిలించుకుంది.

"అసలు నీ లక్ష్యం ఏమిటి?" సాయంత్రం వేళ స్టేడియం మైదానంలో ఓ మూలన కూర్చుని, అతని మొహంలోకి చూస్తూ అడిగింది శాలిని. శేఖర్ సమాధానం చెప్పలేదు. నవ్వాడు.

హైదరాబాదులో ఇప్పుడు ఇద్దరూ ఒకే రూములో ఉంటున్నారు. వంట చేసుకుంటున్నారు.

"పోనీ, నేను చెప్పనా?" కళ్లు గుండ్రంగా తిప్పుతూ అడిగిందామె. కళ్లతోనే అంగీకరించాడు తను.

"పారాలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించాలి".

"అవును... ఈ డొక్కు సైకిల్‌తో!" పెద్దగా నవ్వాడు తను.

"కెరోలీ టాకాక్స్ హంగేరీ అనే వ్యక్తి మిలిటరీలో పని చేసేవాడు. షూటింగ్‌లో అతను దిట్ట. ప్రపంచంలోనే అత్యుత్తమ షూటర్‌గా గుర్తింపు పొందాలనీ, 1940 ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించాలనీ అతని కల..."

ఆమె దేని గురించి చెబుతుందో అర్థం కాక ఆసక్తిగా చూస్తుండిపోయాడు. ఆమె కొనసాగించింది.

"దురదృష్టవశాత్తు ఓ ప్రమాదంలో కుడిచేతిని పోగొట్టుకున్నాడు. అతని మిత్రులంతా సానుభూతి చూపించారు. అతనూ కుంగిపోయాడు. కానీ ఓ మిత్రుడు ఓదార్చాడు. ధైర్యం చెప్పాడు. 'నువ్వు కోల్పోయింది చేతులు కాదు, చెయ్యి' అన్నాడు. ఆ మాటల మధ్య మిళితమైన అంతరార్థాన్ని గ్రహించిన కెరోలీ మరుసటి ఏడాది జాతీయస్థాయిలో జరిగిన పోటీలకు హాజరై ఎడమచేత్తో పతకం సాధించాడు. ఇనుమడించిన ఉత్సాహంతో 1940 ఒలింపిక్స్‌కు సిద్ధమయ్యాడు. దురదృష్టం రెండో ప్రపంచయుద్ధం రూపంలో వెంటాడింది. ఆ క్రీడాసంబరం రద్దయింది. మరో నాలుగేళ్లు ఓపిగ్గా ఎదురు చూశాడు. ఏవో కారణాల వల్ల 1944 ఒలింపిక్స్ కూడా జరగలేదు. పన్నెండేళ్లపాటు లక్ష్యం మీద మనసు లగ్నం చేసి ఉంచడం ఎంత కష్టమో బహుశా ఈ ప్రపంచంలో కెరోలీకి మాత్రమే తెలుసు. కాబట్టే 1948 ఒలింపిక్స్‌లో 38 ఏళ్ల వయసులో స్వర్ణం సాధించాడు. మరో నాలుగేళ్ల తర్వాత కూడా తనే ప్రపంచ విజేతగా నిలిచాడు..."

అబ్బురంగా చూశాడు శేఖర్.

"అందుకే, రేపు నువ్వు మా ఆఫీసుకొస్తున్నావు".

"ఎందుకు?" అయోమయంగా అడిగాడు.

ఆమె జవాబివ్వలేదు.

3

"కట్ చేస్తే... నేను మీ ముందున్నాను. నా జీవితం మీకు స్ఫూర్తినిస్తుందో లేదో తెలియదుగానీ, మీ మధ్య కూర్చున్న శాలిని మేడమ్ నాకో చుక్కాని. దారి చూపారు. ధైర్యమిచ్చారు. ఇప్పుడు నా ముందు రెండే లక్ష్యాలు. సైక్లింగ్ అండ్ రన్నింగ్. రాబోయే పారాలింపిక్స్‌లో ఈ రెంటిలో మన దేశం తరఫున పతకాలు సాధించడమే నా ధ్యేయం. మనకు కనిపించని అవయవాలుంటాయి. వాటిని మనమే మొలిపించుకోవాలి..." అని ఆగాడు శేఖర్.

గంటసేపు ఆవరించిన గంభీర నిశ్శబ్దం బద్దలైంది. చప్పట్లు ప్రతిధ్వనించాయి.

4

"గాడ్! ఎలా జరిగింది" ఆందోళనగా అడిగింది శాలిని.

"కారు ఢీకొట్టింది. నడిపే కుర్రాడు తాగి ఉన్నాడు. ఫ్లై ఓవర్ దిగాక, స్పీడ్ కంట్రోల్ కాక పక్కరోడ్డు మార్జిన్‌లో వెళ్తున్న శేఖర్‌ను ఢీకొట్టేశాడు. బాగా దెబ్బలు తగిలాయి.." తోటి సైక్లిస్టు ఫోన్‌తో శాలిని హడావుడిగా కారులో ఆస్పత్రికి బయల్దేరింది. కారు వేగంతో ఆమె ఆలోచనలు పోటీ పడుతున్నాయి.

నెల రోజుల్లో నేషనల్ లెవల్ సైక్లింగ్ పోటీలు. ఆరోజు శేఖర్ ప్రసంగం విన్న తమ ఆఫీసు వాళ్లంతా సంభ్రమాశ్చర్యాల నుంచి తేరుకుని, అతనికి యథాశక్తి ఆర్థికసాయం ప్రకటించారు. ఆ మీటింగుకు హాజరైన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ హెడ్ ఏకంగా పారాలింపిక్స్‌కు కంపెనీ తరఫున స్పాన్సర్ చేస్తామన్నారు.

ఆ సహకారంతో అన్ని హంగులతో కూడిన లేటెస్ట్ మోడల్ సైకిల్ కొన్నరోజు శేఖర్ ఆనందానికి అవధుల్లేవు. హెల్మెట్, గాగుల్స్, జీపీఎస్ మీటర్, బూట్లు, గ్లౌజులు... అన్నీ కొత్తవే.

విపరీతమైన సాధన మొదలుపెట్టాడు. తను కోచ్‌ను కూడా కుదిర్చింది.

అప్పటికే రెండొందలు, అయిదొందల కిలోమీటర్ల నాన్‌స్టాప్ సైక్లింగ్ ఫీట్లు విజయవంతంగా పూర్తిచేసి వార్తల్లోకెక్కాడు శేఖర్. నేషనల్ లెవల్ పోటీలకు ఎంపికయ్యాడు.

ఇంతలోనే ఈ ఉపద్రవం!

కారు పార్క్‌చేసి, హడావుడిగా ఆస్పత్రిలోకి చేరుకుంది. అప్పటికే శేఖర్‌కు ఆపరేషన్ మొదలైంది.

నాలుగు గంటల సుదీర్ఘ ఎదురుచూపు తర్వాత ఐసీయూలోకి అనుమతించారు.

మత్తులో ఉన్న శేఖర్ నిస్సహాయంగా పడి ఉన్నాడు. ఈసారి కుడికాలు!

శాలినికి దు:ఖం వరదలా పొంగుకొచ్చింది. శేఖర్‌ను ఆ స్థితిలో చూసి పొగిలి పొగిలి ఏడ్చింది.

మూడోరోజు రూముకు మార్చారు. క్రమంగా కోలుకున్నాడు శేఖర్. పది రోజుల తర్వాత డిశ్చార్జ్ చేశారు.

అతనిలో మునుపటి ఆత్మవిశ్వాసం మాయమైంది. ఎప్పుడు చూసినా ఏదో లోకంలో ఉన్నట్లుండేవాడు.

శాలిని బలవంతం మీద రెండు ప్రోస్థటిక్ లెగ్స్‌తో మళ్లీ ప్రాక్టీస్ ప్రారంభించాడు గానీ ఉత్సాహం లేదు.

మరో పదిరోజుల్లో పోటీలు.

ఆరోజు శేఖర్ దిగులుగా కూచొని కిటికీలోంచి బయటికి చూస్తున్నాడు.

శాలిని టీకప్పులతో వచ్చింది.

"మరియప్పన్ తంగవేలు పేరు విన్నావా?" ఓ కప్పు శేఖర్‌కు అందిస్తూ అడిగింది.

అనాసక్తంగా చూశాడు శాలిని వైపు.

"తమిళనాడులో ఓ మారుమూల గ్రామంలో పుట్టాడు. నిరుపేద కుటుంబం. పిల్లల్ని తండ్రి గాలికొదిలి పారిపోతే, బాధ్యత భుజాలకెత్తుకుంది తల్లి. రోజూ కూలికి వెళ్లి పిల్లలకు పిడికెడన్నం పెట్టేది. నలుగురు పిల్లల్లో ఒకడైన తంగవేలు అయిదేళ్ల వయసులో ఇంటిబయట ఆడుకుంటుంటే ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. కుడికాలి పాదం చితికిపోయింది. కర్రసాయంతో నడిచే తంగవేలు కుంగిపోయాడు. తల్లి ప్రోత్సాహంతో క్రీడలపై ఆసక్తి పెంచుకున్నాడు. పాదం లేకపోయినా పాదరసంలా పరిగెత్తుతున్న ఆ కుర్రాణ్ని డ్రిల్లు మాస్టారు ప్రోత్సహించాడు..."

శేఖర్ అప్రయత్నంగా మనసు కేంద్రీకరించాడు. శాలిని కొనసాగించింది.

"సేలంలో క్రీడాశిక్షణ శిబిరంలో చేరుద్దామని తల్లికి సలహా ఇచ్చాడు. ఆటల సంగతి ఎలా ఉన్నా కొడుక్కి ముప్పూటలా ముద్ద దొరికుతుందన్న ఆశతో ఆమె ఒప్పుకొంది. అక్కడ తంగవేలు రాత్రింబవళ్లు కష్టపడ్డాడు. కఠోర సాధన చేశాడు. కాలికి గాయాలైనా, పాదం రక్తమోడుతున్నా లెక్క చెయ్యలేదు. అవయవాలన్నీ చక్కగా ఉన్న అథ్లెట్లతో పోటీపడ్డాడు. జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి, జాతీయస్థాయికి ఎదిగాడు. ఇరవై ఏళ్లు వచ్చేనాటికే హైజంప్‌లో ప్రపంచంలో నంబర్ వన్‌గా నిలిచాడు. మొన్న రియోలో జరిగిన పారాలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించి, దేశానికే వన్నె తెచ్చాడు..."

శేఖర్ మొహంలో కొత్త కాంతి.

5

శేఖర్ తన లగేజీ బ్యాగుతో కారు దిగాడు. హైదరాబాదులోని శంషాబాద్ ఎయిర్‌పోర్టులోకి వెళ్లబోతుండగా "శేఖర్..." ఆర్తిగా పిలిచింది శాలిని.

ఏమిటన్నట్లు చూశాడు శేఖర్. అతన్ని తేరిపార చూసిందామె.

ఆ యువకుడు జీన్స్‌ప్యాంటుతో ధీమాగా నిలబడి ఉంది కృత్రిమకాళ్ల మీదనన్న విషయం ఎవ్వరూ గుర్తించే అవకాశం లేదు. పంజాబ్‌లో జరగబోతున్న నేషనల్ లెవల్ సైక్లింగ్ పోటీల్లో జనరల్ కేటగిరీలో పోటీ పడటానికి వెళుతున్న యోధుడన్న విషయాన్నీ ఎవ్వరూ గుర్తించలేరు.

కోల్పోయిన ఎడమచెయ్యి మాత్రమే... మనిషికి దిష్టిచుక్కలా!

"మేడమ్... పిలిచారు..?"

"ఏం లేదు శేఖర్"

"ఉంది. మీరు మర్చిపోయారు. నేను గుర్తు చెయ్యనా?" అంటూ ఆమె నుదుటి మీద ముద్దుపెట్టి, నవ్వుతూ సాగిపోయాడు వడివడిగా. ఆమె ఆ వైపే చూస్తూండిపోయింది.

విజయంతో అతను తిరిగొచ్చేదాకా ఆ చూపులు అక్కడే గడ్డ కట్టుకుపోతాయన్న విషయాన్ని ఆమె గుర్తించే స్థితిలో లేదు.

(నల్గొండ జిల్లాకు చెందిన సైక్లిస్టు శేఖర్ జీవితం ఆధారంగా)

-------0-------

Click here to share your comments on this story